TELUGU NEWS TIMES

# తెలుగు న్యూస్ టైమ్స్

జాతీయ దిన పత్రిక

J.M.Nayudu
Cell: 91 9840066999
SCCI
Sai Charan Comfort Inn
(Luxury Service Apartments)
Plot No. 1286 & 1345, 5th Street, Golden Colony,
Anna Nagar West Extn., Mugappair, Chennai-50.
Mobile : +91 9840089859, E-mail : saicomfortinn@gmail.com

సంపుటి : 3 | సంచిక : 219 | గురువారం 28 నవంబరు 2024 | పేజీలు : 4 | వెల రూ. 3 | ఎడిటర్ : సిహెచ్. ముకుంద రావు | 9043514736, 9840467131 | online E-paper



## రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఊటీ సందర్శన

**గిండి న్యూస్:** రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము 4 రోజుల పర్యటన నిమిత్తం బుధవారం తమిళనాడులో పర్యటించారు. ఢిల్లీ నుంచి విమానంలో బయలుదేరిన రాష్ట్రపతి నిన్న ఉదయం కోయం బత్తూరు విమానాశ్రయానికి చేరుకున్నారు. కోయంబత్తూరు జిల్లా కలెక్టర్ క్రాంతికుమార్‌పడి, అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం కారులో నీలగిరి జిల్లాకు బయలుదేరారు. విమానాశ్రయం నుంచి అన్నూర్, మెట్టుపాళయం, కోటగిరి మీదుగా ఊటీ రాజ్‌భవన్‌కు చేరుకున్నారు. అక్కడ రాష్ట్రపతికి తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి, జిల్లా కలెక్టర్ లక్ష్మీ భవ్య నద్యతు, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ నిషా పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. బుధవారం రాష్ట్రపతి రాజ్‌భవన్ ప్యాలెస్‌లో విశ్రాంతి తీసుకున్నారు. నేడు ఉదయం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూనూర్‌లోని వెల్లింగ్టన్‌లోని ఆర్మీ ట్రైనింగ్ కాలేజీని సందర్శిస్తారు. అక్కడ ఆమె కు స్వాగతం, సైనిక గౌరవం అందజేయనున్నారు. అనంతరం యుద్ధంలో మరణించిన సైనికుల స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించనున్నారు. అనంతరం అక్కడ జరిగే కార్యక్రమంలో పాల్గొని శిక్షణ అధికారులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. 29న శుక్రవారం ఊటీ రాజ్‌భవన్‌లో నీలగిరి గిరిజనులు, పాదుఖార్ ప్రజలతో సమావేశం కానున్నారు. అందుకు సంబంధించిన సన్నాహాలు కూడా జరుగుతున్నాయి.

# ద్రావిడ పాలనలో రాష్ట్ర పోలీసు శాఖకు స్వర్ణయుగం

**అన్నానగర్ న్యూస్:** కానిస్టేబుళ్లు, జైలు గార్డులు, ఫైర్‌మెన్‌ల ఉద్యోగాలకు ఎంపికైన 3,359 మందికి నియామక ఉత్తర్వులు అందజేసేందుకు బుధవారం చెన్నైలోని కలైంజర్ ఆరంగంలో హెూంశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ 1,000 మందికి స్వయంగా నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మన ద్రావిడ మోడల్ ప్రభుత్వం పోలీసు శాఖను మెచ్చుకునే, దానికి మద్దతుగా నిలిచే ప్రభుత్వం. పోలీసు సిబ్బందికి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ, ప్రజల రక్షణకు కట్టుబడి ఉంటున్నాము. అందువల్లనే తమిళనాడు పోలీసులను భారతదేశంలో స్కాట్లాండ్ యార్డ్‌తో పోలుస్తారు, దీన్ని ప్రపంచంలో ఎవరూ కాదనలేరు. ద్రావిడ మున్నేట్ర కజగం ప్రభుత్వం తొలిసారిగా పోలీస్ కమిషన్‌ను ఏర్పాటు చేసి, పోలీసు సిబ్బంది సంక్షేమానికి అనేక మార్గదర్శక పథకాలను అమలు చేసింది. గత మూడేళ్లలో కానిస్టేబుళ్ల నుంచి డీఎస్పీ వరకు 17,435 మందిని నియమించడంతో పాటు, జైళ్ల శాఖలో 366 మందిని, ఫైర్ అండ్ రెస్క్యూ సర్వీస్‌లో 252 మందిని నియమించామని" అన్నారు. ఈ కార్యక్రమం రాష్ట్ర పోలీసు శాఖకు ఒక మైలురాయిగా నిలిచిందని, పోలీసుల సేవలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తుందని స్టాలిన్ స్పష్టం చేశారు.



## రాజ్ నాథ్ సింగ్‌కు కనిమొళి లేఖ



**గిండి న్యూస్:** డీఎంకే ఎంపీ కనిమొళి బుధవారం కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను వ్యక్తిగతంగా కలిశారు.ఆ సమయంలో లక్షద్వీప్ నేవీ అరెస్టు చేసిన 10 మంది తుత్తుకుడి తరువైకులం మత్స్యకారులను, గుజరాత్ సమీపంలో తప్పిపోయిన మత్స్యకారుడు అన్నాదురైని రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ మేరకు కనిమొళి లేఖను కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు అందించారు. దీనికి సంబంధించి కనిమొళి ఎంపీ తన ఎక్స్ సైట్ పేజీలో ఓ పోస్ట్ పెట్టారు.ఆ పోస్ట్‌లో.... తుత్తుకుడి జిల్లా తరువైకుళం ప్రాంతానికి చెందిన 10 మంది మత్స్యకారులను లక్షద్వీప్ సమీపంలో కోస్ట్ గార్డ్ అరెస్టు చేసినందున, వారిని వెంటనే విడుదల చేయాలని, ఆయన్‌పొమ్మాయపురం ప్రాంతానికి చెందిన మత్స్యకారుడు అన్నాదురైని రక్షించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి అభ్యర్థించాను. తుత్తుకుడి, గుజరాత్‌లోని పోర్‌బందర్ ప్రాంతంలో చేపల వేటకు వెళ్లి అదృశ్యమయ్యాడని పేర్కొన్నారు.




## ఘనంగా అవార్డుల ప్రదానోత్సవం

**విల్లివాకం న్యూస్:** ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ 324 ఎం డిస్ట్రిక్ట్ పిఎంజెఎఫ్ లయన్ ఎన్ వరదరాజన్ డిస్ట్రిక్ట్ ఫస్ట్ అవార్డులను సవేరా నక్షత్ర హెూటలలో చాలా ఘనంగా నిర్వహించారు. డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ ఎంజెఎఫ్ లయన్ ఎస్ మోహన్ రాజ్ మరియు కో డిస్ట్రిక్ట్ ఎంజెఎఫ్ లయన్ పి షణ్ముగ సుందరం ఈ అవార్డ్స్ ఫంక్షన్ బాధ్యతలను సక్రమంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పిఎంజేఎఫ్ లయన్ ఎన్ వరదరాజన్ ఫస్ట్ వైస్ డిస్టిక్ గవర్నర్ పిఎంజెఎఫ్ లయన్ ఎస్ బోస్, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పిఎంజెఎఫ్ లయన్ రాజేష్, ఎం జోషి డిస్ట్రిక్ట్ క్యాబినెట్ అడ్వైజర్ ఎంజెఎఫ్ లయన్ కె.చంద్రశేఖర్, క్యాబినెట్ సెక్రటరీ ఎంజెఎఫ్ లయన్ సి మీనాక్షి సుందరం, క్యాబినెట్ ట్రెజరర్ పీఎంజేఎఫ్ లయన్ ఎస్ శేఖర్, రీజనల్ చైర్ పర్సన్ పిఎంజెఎఫ్ లయన్ జె సురేష్ కుమార్, జోన్ చైర్ పర్సన్ ఎంజెఎఫ్ ఎర్నెస్ట్ లయన్ ఎస్ విఘ్నేశ్వరన్ ఇందులో పాల్గొన్నారు. విజన్, హంగర్, ప్రకృతి పర్యావరణ పరిరక్షణ, డయాబెటిక్, యూత్, హ్యూమానిటీరియన్ ఎఫెక్ట్స్, డిజాస్టర్ రిలీఫ్‌కు చేసిన సేవా కార్యక్రమాలకు గాను సౌత్ సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ లయన్ ఏవి




శివకుమారి ఆరు అవార్డులను అందుకున్నారు. ఈ అవార్డులను గవర్నర్ చేతుల మీదుగా అందుకోవడం చాలా సంతోషంగా ఉందని లయన్ డాక్టర్ శివకుమారి తెలిపారు.

## హైస్పీడ్‌తో రైళ్లు..

**ఢిల్లీ:** దేశంలో త్వరలో హైస్పీడ్ రైళ్లు రాబోతున్నాయి. దీనికి సంబంధించిన పనులు ఇప్పటికే మొదలయ్యాయి. గంటకు 280 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా వీటిని తీర్చిదిద్దుతున్నారు. బీఈఎంఎల్‌తో కలిసి చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో ఈ రైళ్ల డిజైన్, తయారీ కొనసాగుతోందని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. భాజపా ఎంపీ సుధీర్ గుప్తా అడిగిన ప్రశ్నకు ఈ మేరకు ఆయన లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు.

వందేభారత్ రైళ్లు విజయవంతం అయిన నేపథ్యంలో మేకిన్ ఇండియా స్ఫూర్తితో హైస్పీడ్ రైళ్ల తయారీ చేపట్టినట్లు వైష్ణవ్ తెలిపారు. ఇందుకోసం ఒక్కో కార్‌కు (బోగీ) ట్యాక్సులు మినహాయించి రూ.28 కోట్లు ఖర్చవుతుందని చెప్పారు. ఇతర బోగీలతో పోలిస్తే ఈ ఖర్చు ఎక్కువని పేర్కొన్నారు. అయితే, హైస్పీడ్ రైళ్ల సెట్ల తయారీ సంక్లిష్టమని, సాంకేతిక అంశాలు ఇందులో ముడిపడి ఉంటాయని పేర్కొన్నారు.

సాధారణ రైళ్లతో పోలిస్తే వీటి ఏరోడైనమిక్ భిన్నంగా ఉంటాయని వైష్ణవ్ చెప్పారు. గాలి చొచ్చుకోవడానికి వీల్లేకుండా బాడీ ఉంటుందని పేర్కొన్నారు. మొత్తం అన్నీ చైర్ కార్సే ఉంటాయని చెప్పారు. అత్యాధునిక ఫీచర్లు ఉంటాయని పేర్కొన్నారు. ఆటోమేటిక్ డోర్స్, బోగీకి బోగీకి మధ్య అనుసంధానం, బయటి వాతావరణానికి అనుగుణంగా బోగీ లోపలి పరిస్థితులు, సీసీటీవీ, మొబైల్ ఛార్జింగ్ సదుపాయం, ఫైర్ సేఫ్టీ పరికరాలు ఉంటాయని పేర్కొన్నారు. డిజైన్ పూర్తయ్యాక ప్రాజెక్ట్ పూర్తికి అయ్యే వ్యయంపై ఓ అవగాహన వస్తుందని వైష్ణవ్ తెలిపారు.



రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఉదయనిది స్టాలిన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని వేలూరు జిల్లా కాట్పాడి లోని చిత్తూర్ బస్టాండ్ లో వేలూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సునీల్ కుమార్ అధ్యక్షతన ఆటో కార్మికులతో కలిసి కేక్ కట్ చేసి నూతన దుస్తులు అన్నదానం చేశారు అదేవిధంగా కసం అనాధ ఆశ్రమంలో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి అన్నదానం చేశారు ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ టీటా శరవన్ డిఎంకె నాయకుడు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు **-వేలూరు**

## ప్రొఫెసర్ శివపాదం విఠల్ మృతి : ఏఐటిఎఫ్ సంతాపం



**విల్లివాకం న్యూస్:** ప్రొఫెసర్ శివపాదం విఠల్ (1941-2024) మృతి పట్ల అఖిల భారత తెలుగు సమాఖ్య ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసింది. శస్త్ర చికిత్సలో ప్రజ్ఞాశాలి, భారత ఎండోక్రైన్ సర్జరీ పితామహుడు, ప్రొఫెసర్ శివపాదం విఠల్ (83) మృతి చెందారనే విషయాన్ని శోకతప్త హృదయంతో తెలియజేస్తున్నాము. ఆయన ఎంఎంసి (1987)లో ఎండోక్రైన్ సర్జరీ విభాగాన్ని స్థాపించారు, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఎండోక్రైన్ సర్జన్స్ వ్యవస్థాపకులు -అధ్యక్షులు అయ్యారు. సర్జికల్ ఎండోక్రినాలజీపై ఒక పుస్తకాన్ని ప్రొఫెసర్ ఆర్ శరత్చంద్రతో కలిసి రచించారు. ఆయన గొప్ప విశిష్టతతో అనేక పదవులను నిర్వహించారు. ఏఎస్ఐ ప్రెసిడెంట్ గా, ఇంటర్నేషనల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్, ఎడిటోరియల్ బోర్డ్ ఆఫ్ బ్రిటిష్ జర్నల్ ఆఫ్ సర్జరీ, సర్జన్ ట్యూటర్ ఆఫ్ ఆర్సీ ఎడిన్‌బర్గ్, ఎథిరాజ్ కాలేజ్ ట్రస్టీ మొదలైన సేవలందించారు. ఆయనను భారత ప్రభుత్వం డాక్టర్ బిసిరాయ్ జాతీ య అవార్డు (1995), పద్మశ్రీ (2011)తో సత్కరిం చింది. బహుముఖ ప్రజ్ఞాశాలి, గొప్ప హాస్య చతురు లు, కిల్పాక్‌లో సాయికృష్ణ విట్టల్ ఆసుపత్రిని స్థాపించారు. ఆయనకు శాశ్వత శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఏఐటిఎఫ్ అధ్యక్షులు ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి, తమిళనాడు మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్, జనరల్ సెక్రటరీ, డాక్టర్ ఎం గోవలన్ ఒక ప్రకటనలో తెలిపారు.

## బాల్య వివాహాల నిరోధంపై అవగాహన



**విల్లివాకం న్యూస్:** ఐసిడబ్ల్యూఓ - జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కార్యక్రమం 'బాల్య వివాహాలు లేని భారత్'ను బుధవారం నిర్వహించారు. దీనికి చెన్నై అన్నా నగర్ వెస్ట్, వల్లలార్ కాలనీలో గల ఐసిడబ్ల్యూఓ కార్యాలయ ప్రాంగణం వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెన్నై సౌత్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చైర్ పర్సన్ రాజ్ కుమార్ ముత్తుకృష్ణన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్ అనే అతిపెద్ద బ్యానర్ ను ఆవిష్కరించారు. ఏవిఏ - అసోసియేషన్ ఫర్ వాలంటీర్స్ యాక్షన్ స్టేట్ కో-ఆర్డినేటర్ నాదర్షా మాలిమ్. హెచ్ అవగాహన ఇ-పోస్టర్‌ను ఆవిష్కరించారు. అలాగే చెన్నై సౌత్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, మెంబర్ ఏ భక్తవత్సలం అవగాహన ఇ పోస్టర్ ను ఆవిష్కరించారు. అలాగే ఇందులో ఐసిడబ్ల్యూఓ సెక్రటరీ ఏజే హరిహరన్ పాల్గొని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులచే బాల్య వివాహాల నిరోధం పై నినాదాలు చేయించారు. అలాగే క్రొవ్వొత్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఇందులో మేజిస్ట్రేట్లు, సిడబ్ల్యూసి మెంబర్లు, చైల్డ్ సోషల్ యాక్టివిస్టులు, సోషల్ వర్కర్లు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ క్లబ్ మెంబర్లు, కళాశాలల ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

## వేలూరు విరుదంబట్టులో పైవా నూతన షోరూమ్ ప్రారంభం



**వేలూరు:** వేలూరు విరుదంబట్టులో నూతనంగా నిర్మించిన పైవా కొత్తషోరూమ్ను వేలూరు వీఐటీ యూనివర్శిటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, రమణి శంకర్లు ప్రారంభించారు. వీటిలో ఆర్కాడుశేఖర్, కుమారులు తిరువెంగడం, పైవా మేనేజింగ్ డైరెక్టర్ గోకుల్రాజ్,శేఖర్ తదితరులున్నారు.

## విజయవంతంగా మోకాలి మార్పిడి శస్త్రచికిత్స

**విల్లివాకం న్యూస్:** ఎంజిఎం మలర్ అడయార్ హాస్పిటల్, కామెరూన్‌కు చెందిన 54 ఏళ్ల అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు రిచర్డ్ దోవాకు మొత్తం మోకాలి మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తిచేసినట్లు ప్రకటించింది. బుధవారం జరిగిన సమావేశంలో నందకుమార్ సుందరం, సీనియర్ కన్సల్టెంట్, ఆర్థోపెడిక్స్, ఎంజిఎం మలర్ - అడయార్, పేషెంట్ మరియు ఫుట్‌బాల్ క్రీడాకారుడు రిచర్డ్ తోవా మరియు వేణుగోపాల్ భట్, సిఓఓ, ఎంజిఎం మలర్-అడయార్ పాల్గొన్నారు. ఇందులో వైద్యులు మాట్లాడుతూ కేరళ ఫుట్‌బాల్ క్లబ్ మాజీ కోచ్‌గా రిచర్డ్ తోవా భారతదేశంలో పని చేస్తూవచ్చారని. గత ఆరు నెలలకు పైగా భరించలేని తీవ్రమైన మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న ఆయన ఎంజీఎం హెల్త్‌కేర్ మలర్ అడయార్ ఆసుపత్రిని సందర్శించినట్లు తెలిపారు. ఆయనకు పరీక్షలు చేయగా మోకాలు చిప్పలో అరుగుదల కనిపించినట్లు తెలిసిందని, అందుచేత టోటల్ రీప్లేస్మెంట్ కు నిర్ణయించినట్లు తెలిపారు. అనంతరం వైద్యుల పర్యవేక్షణలో విజయవంతంగా శస్త్ర చికిత్స జరిగినట్లు తెలిపారు. డా. నందకుమార్ సుందరం



మాట్లాడుతూ ఎసిఎల్, ఎమ్‌సిఎల్, మస్క్యులో కార్టిలేజ్ వంటి మోకాలి గాయాలు ఫుట్‌బాల్‌లో సర్వసాధారణం కాబట్టి సమర్థవంతమైన నివారణ వ్యూహాల ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. ఫుట్‌బాల్ ఆటగాళ్లకు మోకాలి కీలు యొక్క ప్రాముఖ్యత చాలా ముఖ్యం. క్రీడల సమయంలో జరిగే ఈ కార్యకలాపాలన్నీ మోకాలి కీలుపై గణనీయమైన ఒత్తిడిని కలిగిస్తాయి. ఈ ఒత్తిడి, ఆట యొక్క అధిక తీవ్రతతో పాటు, చిన్న గాయాలు మాత్రమే కాకుండా తీవ్రమైన గాయాలు అథ్లెట్ యొక్క ఆట వృత్తిని ప్రభావితం చేయగలవని అన్నారు.

## త్వరలో సాగునీటి సంఘాలు, కో-ఆపరేటివ్ ఎన్నికలు

**అమరావతి:** పార్టీ సభ్యత్వ నమోదులో మొదటి పది స్థానాల్లో ఉన్న ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, నేతలను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. అనతికాలంలోనే సభ్యత్వాలను 52 లక్షలకు చేర్చడంపై హర్షం వ్యక్తం చేశారు. గత నెల 26న పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టగా.. ఇప్పటివరకు 52.45 లక్షల మంది సభ్యత్వం తీసుకున్నారని.. ఇదొక చరిత్ర అని అన్నారు. ఈ విషయంలో ప్రత్యేకంగా మంత్రి లోకేశ్‌ను చంద్రబాబు అభినందించారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్లమెంట్ నియోజకవర్గాల అధ్యక్షులు, గ్రామస్థాయి కార్యకర్తలతో సీఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని విధాలుగా దెబ్బతిన్న రాష్ట్రాన్ని గాడినపెడుతూనే పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. సరైన వ్యక్తిని సరైన చోట ఉంచుతామన్న మాటకు కట్టుబడి.. పార్టీ కోసం శ్రమించిన వారిని పదవుల్లో నియమిస్తున్నామని వెల్లడించారు. "గత అరాచక పాలనలో మన కార్యకర్తలు ప్రాణాలు, ఆస్తులు పోగొట్టుకున్నారు. అయినా భయపడకుండా పోరాటం చేయడం వల్లే 57 శాతం ఓట్లతో 93 శాతం స్ట్రైక్‌రేట్‌తో కూటమి విజయం సాధించింది. కోల్పోయిన ఆ 11 స్థానాల్లోనూ స్వల్ప ఓట్లతేడాతో ఓడిపోయాం. కొత్తగా పొలిటికల్ గవర్నెన్స్ విధానం తీసుకొచ్చాం. పార్టీని ప్రభుత్వంతో అనుసంధానం చేసి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం. కొద్ది రోజుల్లోనే సాగునీటి సంఘాలు, కో-ఆపరేటివ్ ఎన్నికలు జరగనున్నాయి. వీటిల్లోనూ కూటమి అభ్యర్థులే విజయం సాధించేలా పని చేయాలి. రాజంపేట, కుప్పం, కళ్యాణదుర్గం, పాలకొల్లు, ఆత్మకూరు, మంగళగిరి, కనిగిరి, కోడూరు, వినుకొండ, కావలి నియోజకవర్గాలు టాప్ 10లో ఉన్నాయి. అక్కడి నాయకత్వాన్ని మన స్ఫూర్తిగా అభినందిస్తున్నా. రోడ్ల మరమ్మతులకు రూ.1400 కోట్లు మంజూరు చేశాం. సంక్రాంతి నాటికి రాష్ట్రంలో ఎక్కడా రోడ్లపై గుంతల్లేకుండా చేస్తాం. యువతకు ఉద్యోగ కల్పనే ప్రధాన లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. మనం చేసే రాజకీయం కేవలం ప్రజల కోసమే. ప్రజలను చైతన్యపరుస్తూ మనం చేస్తున్న మంచి కార్యక్రమాలను వారికి వివరించాలి. మనది సంక్షేమానికి పెద్ద పీట వేసే ప్రభుత్వం. అధికారాన్ని అడ్డంపెట్టుకుని తప్పులు చేసిన వారికి చట్టపరంగా శిక్షలు పడేలా చేస్తాం. త్వరలోనే రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యలు పరిష్కరిస్తాం"అని చంద్రబాబు తెలిపారు.



# మార్కెట్‌లోకి ఏఎంసి మల్టీ కుకింగ్ సిస్టమ్స్




**విల్లివాకం న్యూస్:** గ్లోబల్ కుక్ వేర్ కంపెనీ ఏఎంసి ఉన్నత స్థాయి స్టెయిన్లెస్ స్టీల్ మల్టీ కుకింగ్ సిస్టమ్స్ ను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించింది. చెన్నై అన్నానగర్ వెస్ట్,18 మెయిన్ రోడ్డులో గల ఏఎంసి ఇండియా డైరెక్ట్ సెల్లింగ్ ప్రైవేట్ లిమిటెడ్, సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎం కార్తికేయన్ బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తాము ప్రవేశపెడు తున్న కుకింగ్ సిస్టమ్స్ కు అంతర్జాతీయ స్థాయిలో అధిక ఆదరణ లభిస్తున్నట్లు తెలిపారు. 1996లో భారతదేశంలో ప్రొడక్షన్ సెంటర్ తో ప్రారంభం అయినట్లు తెలిపారు. ఈ వంట పాత్రలలో యూనిఫామ్ హీటర్ సొల్యూషన్ ఉందని, మోనో కూలింగ్ థర్మో బ్లాక్ సిస్టం ఉన్నాయని అన్నారు. వీటి ద్వారా ఫ్యాట్ లెస్, వాటర్ లెస్ కుకింగ్ సాధ్యమని, దీంతో శరీరక ఆరోగ్యం ఇనుమడిస్తుం దని అన్నారు. ఆయిల్ లేకుండా వంట సాధ్యమని, చిన్నపిల్లలు కూడా వంట చేసు కునే వీలుందన్నారు. బెంగళూరులో కర్మాగారాన్ని కలిగి ఉన్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9786159218 కు సంప్రదించాలని తెలిపారు.

# కార్గిల్, సియాచిన్, గల్వాన్‌లలో పర్యటించొచ్చు



హిమాలయాల్లోని యుద్ధక్షేత్రాల సందర్శనకు సంబంధించి భారత సైన్యం కీలక నిర్ణయం తీసు కుంది. కార్గిల్, సియాచిన్ గ్లేసియర్, గల్వాన్‌లలో పర్యటకులకు అనుమతించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది వెల్లడించారు. "జమ్మూకశ్మీర్‌లో పర్యటకాభివృద్ధికి అపార అవకాశాలున్నాయి. కొంతకాలంగా సందర్శకుల పెరుగుదల భారీగా కనిపిస్తోంది. పర్యటకాన్ని ప్రోత్సహించేందుకు 48 ప్రాంతాలను గుర్తించాం. వచ్చే ఐదేళ్లలో పర్యటకుల సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం ఉంది" అని చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ ద్వివేది వెల్లడించారు. పుణె యూనివర్సిటీలో 'భారత్ వృద్ధి పయనంలో ఇండియన్ ఆర్మీ పాత్ర' అంశంపై జనరల్ ద్వివేది ప్రసంగించారు. సరిహద్దు ప్రాంతాల్లో పర్యటకుల కోసం సాహస కార్యకలాపాలను ఆర్మీ ప్రోత్సహి స్తుందని, ఇందుకోసం టూర్ ఆపరేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తుందని తెలిపారు. కార్గిల్, గల్వాన్ వంటి యుద్ధక్షేత్రాలను చూసేందుకు పర్యటకులకు అనుమతిస్తారు. లద్దాఖ్‌లోని కారాకోరం పర్వత శ్రేణుల్లో ఉన్న సియాచిన్ గ్లేసియర్.. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన యుద్ధక్షేత్రం. అత్యంత ప్రతికూల పరిస్థితుల్లో ఇక్కడ సేవలందించడం సైన్యానికి సవాల్‌తో కూడుకున్న పని. లద్దాఖ్‌లోనే ఉన్న కార్గిల్‌లో 1999లో భారత్-పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం జరిగింది. గల్వాన్ లోయలో భారత్-చైనా బలగాల మధ్య 2020 జూన్‌లో చోటుచేసుకున్న ఘర్షణల్లో అనేక మంది అమరులైన విషయం తెలిసిందే.

# రాష్ట్ర స్థాయి యోగాసన సమిష్టి పోటీలు




**విల్లివాకం న్యూస్:** తిరువణ్ణామలై జిల్లా, ఆరణిలో ఉన్న డాక్టర్ ఎంజీఆర్ చొక్కలింగం ఆర్ట్స్ కళాశాలలో వేలూరు జిల్లా యోగా అసోసియేషన్ మరియు స్పేస్ యోగా ఫౌండేషన్ తరపున తృతీయ రాష్ట్ర స్థాయి యోగాసన సమిష్టి పోటీలు జరిగాయి. ఇందులో తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండిలోని వినశ్రీ యోగా కేంద్ర విద్యార్థులు పలువురు తమ తమ ప్రతిభను ప్రదర్శించారు. 14 ఏళ్ల నిండిన బాలుర విభాగంలో ఎం హరీష్ (00) మొదటి బహు మతి గెలిచారు. అలాగే పది సంవత్సరాల వయస్సు గలవారి మధ్య బాలికల విభాగంలో జైశ్రీతన మొద టి బహుమతి గెలుచుకున్నారు. అలాగే మొత్తం ఛాంపియన్షిప్ పట్టాన్నీ గుమ్మిడిపూండి వినశ్రీ యోగా కేంద్ర విద్యార్థులు గెలిచారు. అలాగే విద్యార్థి విద్యార్థినుల విజయాలకు ఊతమిచ్చిన యోగా జీవితకాల విజేత అవార్డు పొందిన ఉపాధ్యా యుడు కాళతీశ్వరన్ మరియు శిక్షణ పొందిన ఆచార్యులు అర్చన, విద్యలకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# 7.62 లక్షల కిలోల మాదకద్రవ్యాల ధ్వంసం: కేంద్రం వెల్లడి



**ఢిల్లీ:** పార్లమెంట్ సమావేశాలు కొనసాగు తున్నాయి. ఈ క్రమంలోనే రాజ్యసభలో కేంద్రం కీలక విషయాన్ని వెల్లడించింది. గతేడాది దేశ వ్యాప్తంగా 7 లక్షల కిలోలకు పైగా మాదక ద్రవ్యా లను డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు ధ్వంసం చేశాయని కేంద్రహోం శాఖ సహాయ మంత్రి నిత్యా నందరాయ్ పేర్కొన్నారు. "దేశవ్యాప్తంగా 2023లో 7.62 లక్షల కిలోల మాదకద్రవ్యాలను ధ్వంసం చేశాం. 2019తో పోలిస్తే ఇది దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ. 2019లో 1,55,929 కిలోల మాదక ద్రవ్యా లు ధ్వంసం చేయగా.. 2023లో 7.62లక్షల కేజీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నాటితో పోలిస్తే దీనిలో 388 శాతం పెరుగుదల కనిపించింది. డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో నివేదికలో ఈ విషయాన్ని పేర్కొన్నాయి" అని నిత్యా నందరాయ్ వెల్లడించారు.

# పరవాడ ప్రమాదంపై సీఎం చంద్రబాబు ఆరా



**పరవాడ:** అనకాపల్లి జిల్లా పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలోని మరో పరిశ్రమ నుంచి విషవాయువు లీకై కార్మికుడు మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ఠాగూర్ ల్యాబొరేటరీస్ కంపెనీలో మంగళవారం విషవాయువు లీకై 9 మంది కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వారిని గాజువాకలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఒడిశాకు చెందిన కార్మికుడు అమిత్(22) మృతి చెందాడని, మరొకరి పరిస్థితి విషమంగా ఉందని కార్మిక సంఘాలు తెలిపాయి.

**బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి: సీఎం**

మరో వైపు ఠాగూర్ ల్యాబొరేటరీస్ ప్రమాద ఘటనపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. బాధితు లకు మెరుగైన వైద్యం అందించి ప్రాణాపాయం లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా వారికి సాయం చేయాలన్న ముఖ్య మంత్రి... బాధితులకు అందుతున్న సాయంపై జిల్లా యంత్రాంగం, సంబంధిత మంత్రులు స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు.

**ప్రమాద స్థలంలో సీసీ టీవీ ఫుటేజ్ సేకరిస్తున్నాం: కలెక్టర్**

ఠాగూర్ ల్యాబ్స్ ప్రమాదంపై దర్యాప్తు జరుగు తోందని కలెక్టర్ విజయ్‌కృష్ణన్ తెలిపారు. రియాక్టర్ కమ్ రిసీవర్ ట్యాంక్ నుంచి లిక్విడ్ హెచ్‌సీఎల్ లీకైందని వెల్లడించారు. తొమ్మిది మంది కార్మికు లకు శ్వాస, దగ్గు సమస్యలు వచ్చాయని తెలిపారు. అస్వస్థతకు గురైన వారిని గాజువాకలోని పవన్ సాయి ఆసుపత్రికి, ముగ్గురిని విశాఖ షీలానగర్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు. చికిత్స పొందుతూ అమిత్ అనే కార్మికుడు మృతి చెందా డని, మరో ఇద్దరు కార్మికులకు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారని పేర్కొన్నారు. ఆరుగురి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించాలని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌ను ఆదేశించామని కలెక్టర్ వివరించారు. ప్రమాద స్థలంలో సీసీ టీవీ ఫుటేజ్ సేకరిస్తున్నామన్నారు.

# విజయ్‌పాల్‌కు రిమాండ్

**గుంటూరు:** సీఐడీ మాజీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్‌ను పోలీసులు గుంటూరు కోర్టులో హాజరుపర్చారు. 11 పేజీల రిమాండ్ రిపోర్టును కోర్టు ముందుంచిన పోలీసులు.. విజయ్‌పాల్‌ను రిమాండ్‌కు ఇవ్వాలని కోరారు. కస్టోడియల్ ఇంటరాగేషన్ చేయాల్సి ఉందని తెలిపారు. వాస్తవాలు రాబట్టేందుకు ఇంటరాగేషన్ అవసరమని పేర్కొన్నారు. రఘురామకు చిత్రహింసల కేసులో విజయ్‌పాల్ పాత్ర కీలకమని కోర్టు దృష్టికి తెచ్చారు. చిత్రహింసల వెనుక సూత్రధారులను కనుగొనాల్సి ఉందని పోలీసులు తెలిపారు. రిమాండ్ రిపోర్టు పరిశీలించిన న్యాయమూర్తి విజయ్‌పాల్‌కు 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో విజయ్‌పాల్‌ను పోలీసులు గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. రఘు రామకృష్ణరాజును కస్టడీలో తీవ్రంగా వేధించారని, సీఐడీ కార్యాలయానికి వెళ్లిన వ్యక్తి నడవలేని స్థితిలో వచ్చారని ప్రాసిక్యూషన్ జాయింట్ డైరెక్టర్ వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు." రఘురామ కాళ్లను తాళ్లతో కట్టేసి కొట్టారు. ఆయన్ను చంపడానికి ప్రయత్నించారు. తనపై దాడి విషయాన్ని రఘురామ కోర్టులో చెప్పారు. తప్పుడు నివేదిక ఇచ్చిన జీజీహెచ్ వైద్యులూ నిందితులే. ఈ కేసులో ఇప్పటి వరకు 27 మందిని విచారించాం. నాడు విచారణ సందర్భం గా ఉన్నవారినీ విచారించాం. రఘురామపై దాడి జరిగినట్టు నిర్ధరణకు వచ్చాం. ఆయనను వేధించిన విషయం వీడియో తీసి అప్పటి పెద్దలకు పంపించారు. వారు ఎవరనేది త్వరలో తేలుతుంది" అని రాజేంద్రప్రసాద్ తెలిపారు.

With best compliments from
Rtn, J.S.K. Naidu
Proprietor
9840066772



NATIONAL INDUSTRIAL SECURITY AGENCY
Specialized in security services
The best & Reliable Security Services for
Institutions
Industries
Commercial Offices
Apartments
Bungalows
Hospitals
Banks
Bouncer Ceremonial Functions & Events



JSK SECURITY SERVICES (P) LTD
Specialized in investigation of



Matrimonial
Thefts
Finger Prints
Pre & Pro Bio Data of Employees
Company records of Employees

NISA SECURITY
No.28/24, 1st Main Road, Jai Nagar, Arumbakkam, Ch-106
Ph: 044-43531187 | Mobile: 98400 39394 | 98400 28888
E-Mail: nisaagency01@gmail.com
15

## శరవేగంగా దూసుకు వస్తున్న

# ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్!



- అన్ని రంగాలపై ప్రభావం
- డాక్టర్ నాదేళ్ల విజయ భాస్కర్ చౌదరి

**అన్నమయ్య జిల్లా న్యూస్:** మారుతున్న కాలానుగుణంగా ఆధునికత రాజ్యమేలుతోంది. ఇందుకు అనుగుణంగా వ్యక్తులు, ఉద్యోగులు, వ్యవస్థలు అప్ డేట్ కావాలని అప్పుడే మనుగడ సాధ్యమని మదనపల్లె దగ్గర అంగళ్ళులోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ నాదేళ్ల విజయభాస్కర్ చౌదరి హెచ్చరించారు. కళాశాలలో ఆయన మాట్లాడుతూ జీవితంలో ముందుకు సాగాలంటే మారుతున్న టెక్నాలజీని ఎప్పటికప్పుడు ఒడిసి పట్టుకోవాలన్నారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) యుగం ముంచుకు వస్తోందన్నారు. యావత్ ప్రపంచమంతా దీనివైపు చూస్తోందన్నారు. ఇందుకు సంబంధించి అంతటా వేగంగా మధనం జరుగుతోందన్నారు. ఇప్పటికే వివిధ రంగాల్లో దీని వినియోగం క్రమేణా పెరుగుతోందన్నారు. రాబోవు రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పవర్ ఫుల్ గానే కాకుండా పాపులర్‌గా మారనుందన్నారు. దీని ప్రభావం అది ఇది అని కాకుండా అన్ని రంగాల్లో కన్పించనుందన్నారు. రానున్న రోజుల్లో రోబోల రాజ్యం వచ్చే అవకాశం లేకపోలేదన్నారు. ఏఐ రెండు వైపులా పదునున్న కత్తి లాంటిదన్నారు. దేనికైనా అనుకూల ప్రతికూల, సద్వినియోగం దుర్వినియోగం అంశాలు రెండూ ఉంటాయన్నారు. ప్రపంచంలో వివిధ రంగాలకు ఏఐ పెను సవాల్ గా మారనుందన్నారు. ఇన్నాళ్లు ఇంటర్నెట్, సోషల్ మీడియా, డిజిటల్ రంగం ప్రభావం అధికంగా కన్పించిందన్నారు. వీటికి మించి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రభావం ప్రపంచాన్ని శాసించనుందన్న అభి ప్రాయం వ్యక్తమవుతోందన్నారు. అందుకే ఏ రంగంలోనైనా మనుగడ సాగించాలంటే ఎప్పటికప్పుడు అప్ డేట్ గా ఉండాల్సిన అవసరం ఆవశ్యకత ఉందన్నారు. నిరంతరం నేర్చుకునే వారికి మాత్రమే ఇది సాధ్యమన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే విజ్ఞానానికి మించిన ప్రజ్ఞానం ఏఐకి ఉండబోతోందన్నారు. ఇందుగలడందు లేదన్న విదంగా ఇది సర్వాంతర్యామిగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయన్నారు.

# తుపానుగా మారనున్న తీవ్ర వాయుగుండం

**అమరావతి:** దక్షిణ బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం కొనసాగుతోంది. మరో 6 గంటల్లో ఇది తుపానుగా మారే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారి జగన్నాథ్ కుమార్ తెలిపారు. "నైరుతి బంగాళాఖతంలో ఉన్న తీవ్ర వాయుగుండం బుధవారం ఉదయం చెన్నైకు దక్షిణ ఆగ్నేయ దిశలో 550 కి.మీ, పుదుచ్చేరికి 470 కి.మీ కేంద్రీకృతమై ఉంది. రాగల 12 గంటల్లో ఉత్తర వాయువ్య దిశలో పయనించి తుపానుగా మారే అవకాశం ఉంది. రాగల రెండ్రోజులు ఉత్తర ఆగ్నేయ దిశలోనే ప్రయాణించి తమిళనాడు తీరంలో కేంద్రీకృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా ప్రాంతంలో పలు చోట్ల గురువారం, శుక్రవారం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తీర ప్రాంతాల్లో 35 నుంచి 55 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముంది" అని తెలిపారు.

# పెండింగ్‌లో ఉద్యోగ నియామకాలు.. భర్తీకి ఏపీపీఎస్సీ కసరత్తు

**అమరావతి:** పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ నియామకాలు భర్తీ చేయడంపై ఏపీపీఎస్సీ ఛైర్‌పర్సన్ అనురాధ దృష్టి సారించారు. గత వైకాపా ప్రభుత్వం పలు విభాగాల్లో అరకొర సంఖ్యలో ఖాళీల భర్తీ కోసం పలు ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేసినప్పటికీ నియామక ప్రక్రియ ముందుకు సాగలేదు. దీనివల్ల అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రూప్-1, గ్రూప్-2 సహా అంతకుముందు విడుదల చేసిన 19 నోటిఫికేషన్ల నియామకాలు పెండింగ్‌లో ఉన్నాయి. క్రమంగా వాటన్నింటినీ పూర్తి చేసేందుకు ఏపీపీఎస్సీ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. పలు పరీక్షల ఫలితాలు విడుదల చేయడం సహా నియామక ప్రక్రియను ముందుకు తీసుకెళ్తోంది. ఇప్పటికే గ్రూప్-2 పరీక్ష తేదీలు నిర్ణయించిన ఏపీపీఎస్సీ.. గ్రూప్-1 మెయిన్స్ నిర్వహణ సహా మిగిలిన నియామకాల ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటోంది.

గతేడాది జూన్‌లో నోటిఫికేషన్ విడుదల చేసి పెండింగ్‌లో ఉన్న హోమియోపతి లెక్చరర్ల పరీక్ష ఫలితాలను మంగళవారం కమిషన్ విడుదల చేసింది. ఇందుకు సంబంధించి సర్టిఫికెట్ వెరిఫికేషన్ తేదీలనూ ప్రకటించింది. డిసెంబర్ 3న ధ్రువపత్రాల పరిశీలనకు ఏర్పాట్లు చేసింది. 2021లో నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్షలు జరిగినా ఫలితాలు విడుదల చేయకుండా ఉండిపోయిన దేవాదాయశాఖలో అసిస్టెంట్ కమిషనర్ ఉద్యోగ నియామక పరీక్ష ఫలితాలను ఇవాళ విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఏపీపీఎస్సీ వెబ్ సైట్‌లో పొందుపరిచారు. ఇప్పటికే నోటిఫికేషన్లు విడుదల చేసి.. నియామక ప్రక్రియ పెండింగ్‌లోఉన్న పలు ఉద్యోగ నియామకాల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా కమిషన్ కార్యాచరణ రూపొందించింది.

### కారు ఢీకొని ఐదుగురు మహిళల మృతి



**అన్నానగర్ న్యూస్:** చెంగల్‌పట్టు జిల్లా తిరుపోరూర్ సమీపంలోని పండితమేడు ప్రాంతంలో మేకలు, ఆవులను మేపుతున్న మహిళలను కారు ఢీకొట్టింది. చెన్నై నుంచి మామల్లపురం వైపు వెళ్తున్న కారు రోడ్డు పక్కన కూర్చున్న వారిని ఢీ కొట్టినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.ఈ ఘటనలో మృతుల బంధువులు కారు నడుపుతున్న యువకుడిని పట్టుకుని కొట్టారు.డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు సమాచారం. ప్రమాదంపై పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ జరుపుతున్నారు.అలాగే జిల్లా కలెక్టర్ సంఘటనా స్థలానికి రావాలంటూ గ్రామస్తులు మృతదేహాలను రోడ్డుపైనే ఉంచి నిరసన తెలిపారు.ఘటనా స్థలంలో చెంగల్పట్టు జిల్లా ఎస్పీ గ్రామస్తులతో చర్చలు జరిపారు.

### రీచ్‌లలో స్వయంగా ఇసుక తవ్వి తీసుకెళ్లేందుకు అనుమతించాలి

**అమరావతి:** రాష్ట్రంలో ఇసుక డిమాండ్ పెరుగు తున్న దృష్ట్యా సరఫరా పెంచాల్సిందిగా సీఎం చంద్ర బాబు అధికారులను ఆదేశించారు. ఇసుక సరఫ రాపై బుధవారం సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు, ఇసుక లభ్య తపై ఎదురవుతున్న ఇబ్బందుల నేపథ్యంలో సీఎం.. ఈమేరకు ఆదేశాలు జారీ చేశారు. ఇసుక లభ్యత, పారదర్శకంగా సరఫరా, అక్రమాల నియంత్రణ వంటి అంశాలపై ముఖ్యమంత్రి మరోమారు అధికా రులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వ్యక్తిగత అవసరాల కోసం ఇసుక తీసుకెళ్లే వారిని ఇబ్బందులు పెట్టొద్దని మరో మారు అధికారులకు సూచనలు ఇచ్చారు.



# మంచుకొండల్లో జలప్రళయ ముప్పు

**ఢిల్లీ:** వాతావరణ మార్పుల వల్ల భూ ఉష్ణోగ్రత పెరిగి హిమాలయాల్లోని హిమానీ నదాలను కరిగించేస్తోంది. అలావచ్చే నీరు మంచుకొండల్లోని హిమానీ నదాల జలాశయాల విస్తీర్ణాన్ని పెంచుతోంది. ఏదో ఒకనాడు ఆ జలాశయాలు కట్టతెంచుకుని దిగువనున్న జనావాసాలు, జీవజాతులు, ఆనకట్టలు, రోడ్లవంటి మౌలిక వసతులను ముంచెత్తి తీరని నష్టం కలిగించే ప్రమాదం తీవ్రమవుతోంది. లద్దాఖ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్‌లలోని 67 హిమనద జలాశయాల ఉపరితల వైశాల్యం 40 శాతం పెరిగిందనీ, అవి కట్టలు తెంచుకునే ప్రమాదం పొంచివుందని ఇటీవల ఒక వార్తాకథనం వెలువడింది. దాన్ని సుమోటోగా స్వీకరించిన జాతీయ హరిత ట్రైబ్యునల్ కేంద్ర ప్రభుత్వానికీ, ఇతర పక్షాలకూ నోటీసు జారీచేసింది. తమ సమాధానాన్ని తదుపరి విచారణ తేదీ అయిన మార్చి 10కి వారం రోజుల ముందు సమర్పించాలని ఆదేశించింది. గడచిన 13 ఏళ్ళలో భూతాపం వల్ల హిమనదాలు 10.81 శాతం విస్తరించాయని వార్తాకథనం వెల్లడించింది. 2011-2024 మధ్య భారత్‌లోని హిమనదాల ఉపరితల వైశాల్యం 33.7 శాతం పెరిగింది. ఈ పరిణామం జీవ వైవిధ్య చట్టానికి, జల కాలుష్య నివారణ/ పర్యావరణ రక్షణ చట్టాలకు భంగకరమని వార్తా కథనం పేర్కొంది.




